క్లుప్తంగా

పొదుపుగా వాడుకోవాలి

ఖానాపురం : పాకాల ఆయకట్టు పరిధిలో రైతులంతా నీటిని పొదుపుగా వాడుకోవాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పాకాలకు గోదావరి జలాలను తీసుకొచ్చిన సందర్భంగా మండలంలోని ధర్మారావుపేటకు చెందిన రైతులు శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యాసంగిలో పంటలు పూర్తయ్యే వరకు పూర్తి స్థాయిలో నీరు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం

సంగెం: మండలంలోని తిమ్మాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా గురుతరమైన బాధ్యతలు చేపట్టారు. ప్రధానోపాధ్యాయురాలిగా రమ్య, వైశాలి, మణితేజ, రాజ్‌కుమార్, విశ్వనాథ్ వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పండ్ల పంపిణీ



నర్సంపేట రూరల్ : సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్త 54వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ గోపాల్, సమాచార హక్కు వికాస సమితి మండల అధ్యక్షుడు రమేష్, శివ, శ్రీను, కుమారస్వామి, శ్రీకాంత్, మధు,రాజు, పాషా, లక్ష్మణ్, సాంబయ్య పాల్గొన్నారు.

రేషన్ డీలర్ మృతి



నెక్కొండ : గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గొల్లపల్లి రేషన్ డీలర్ నాగపురి సాంబయ్య (50) మృతి చెందినట్లు బాధిత కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. మృతదేహాన్ని వివిధ పార్టీ నాయకులు సందర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు గోరంట్ల వెంకట్ నారాయణ, ప్రధాన కార్యదర్శిసురేందర్, కోశాధికారి శ్రీలత, నాయకులు పరామర్శించారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలి

నర్సంపేట : పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ గుడిసెవాసులకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ కో కన్వీనర్ తడుగుల విజయ్, ఇన్‌చార్జ్ కల్లెపల్లి ప్రణయ్‌దీప్, డీపీఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు అందె రవి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు డీపీఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ పార్టీలు సంయుక్తంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలో విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జలగం రమేష్, మునిగె యాకోబు, వేల్పుగొండ రాజు, దామర సుధాకర్, గుంపుల మాలతి, లత, అజ్మీర సుజాత, తదితరులు ఉన్నారు.

యువకుడికి గాయాలు



వర్ధన్నపేట: రోడ్డుపై వెళ్తున్న ఓ యువకుడిని బైక్ ఢీ కొట్టడంతో అతనికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి కట్ర్యాల శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కట్ర్యాలకు చెందిన వేమూరి నాగరాజు ఉప్పరపల్లి క్రాస్‌రోడ్డు నుంచి గ్రామానికి నడుచుకుంటూ వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం వేగంగా వస్తూ అదుపు తప్పి నాగరాజుకు ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్రవాహనం దారులకు సైతం గాయాలు కావడంతో క్షతగాత్రులను 108లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

గౌరవ వేతనం ప్రకటించాలి



నర్సంపేట : ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం కానుకగా రేషన్ డీలర్లకు గౌరవవేతనం ప్రకటించాలని వరంగల్ జిల్లా రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దరావత్ మోహన్‌నాయక్ కోరారు. కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని పట్టణంలోని బాలాజీ కళాశాల ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాజకలరాంనారాయణ, డీలర్లు కృష్ణమూర్తి, చంద్రమౌళి, సుధాకర్, శ్రీనుబాబు, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : వర్ధన్నపేటలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్



గీసుకొండ : మొగిలిచర్లలో కేక్ కట్ చేస్తున్న పరకాల ఎమ్మెల్యే ధర్మారెడ్డి



సీఎం కేసీఆర్ కారణజన్ముడు

సీఎం కేసీఆర్ కారణజన్ముడని. ఆయన చేపట్టిన ప్రజాసంక్షేమ పథకాలు నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతూ దేశ ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయని పరకాల, నర్సంపేట ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ మొగిలిచర్లలో, గీసుకొండ, వర్ధన్నపేట, నర్సంపేట, సంగెం, చెన్నారావుపేట, దుగ్గొండి, పర్వతగిరి, ఖానాపురం మండలాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసిన అనంతరం పేదలకు అన్నదానం చేశారు. పలుచోట్ల మొక్కలను నాటారు. కార్యక్రమాల్లో పార్టీ ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నర్సంపేట : కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



చెన్నారావుపేట : కేక్ కట్ చేస్తున్న నాయకులు



రాయపర్తి : మజీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



దుగ్గొండిలో..



సంగెం : సంగమేశ్వరాలయంలో నేతల పూజలు



పర్వతగిరిలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

సంపదలిచ్చే ఈశ్వరుడే 'సంగమేశ్వరుడు'

- ఆపన్నులకు అభయం ఇచ్చే కలియుగదైవం
- నమ్మి కోరిన వారికి కొంగుబంగారం
- మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన సంగమేశ్వరాలయం

సంగెం: నమ్ముకుని నియమ నిష్ఠలతో కొలసిన భక్తులందరికి సకల సంపదలిచ్చే ఈశ్వరుడే సంగమేశ్వరుడుగా మండలకేంద్రంలో వెలిశాడని ప్రతీతి. త్రిగుణాత్మక స్వరూపంగా ఆ పరమేశ్వరుడు వెలసిన ప్రదేశం ఆపన్నులకు ఆశ్రయం కల్పించింది. ఈశ్వరాజ్ఞతో అక్కడకు చేరుకున్న వారంతా కలిసికట్టుగా 'సంగం'గా జీవిస్తామని మాట ఇచ్చి స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. మహాశివరాత్రి రోజున జరిగే జాతరకు మండలంలోని గ్రామాలు, చుట్టు ప్రక్కల గ్రామాల నుండియే గాక ఉమ్మడి వరంగల్, కరీంనగర్, హైదరాబాద్, ఖమ్మం తదితర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు సమర్పించుకుంటారు. సంగెంతో పాటుగా చుట్టు ప్రక్కల గ్రామాల వారికి సంగమేశ్వరుడే ఇలవేల్పు. గ్రామంలో ఎవరింటా ఏ శుభకార్యం జరిగినా మొదట సంగమేశ్వరుడిని దర్శించుకుంటారు.



సంగెంలో విద్యుత్ దీపాలతో ముస్తాబైన సంగమేశ్వరాలయం

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి...

సంగమేశ్వరాలయంతో పాటు మండలంలోని కుంటపల్లిలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, చింతలపల్లిలోని భవానిశంకరాలయం, గవిచర్లలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, ఎల్గూర్‌రంగంపేట తదితర గ్రామాల్లోని శివాలయాలు మహాశిరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం జరిగే ఉత్సవాల కోసం ఏర్పాట్లు అన్ని పూర్తి చేసినట్లు ఆయా గ్రామాల ఆలయ అభివృద్ధి కమిటీ, ఉత్సవ కమిటీలు తెలిపాయి.

శివుడికి నీడ కరువు

- చెట్టు కిందే శివాలయం
- పూజలకు భక్తుల ఏర్పాట్లు

దుగ్గొండి: శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదనే నానుడి ప్రాచీన కాలం నుంచి ఉంది. అయితే ఎందరో జీవితాలను వెలుగునింపుతాడని భావిస్తున్న మహాదేవుడికి నీడ కరువైంది. పురాతన శివాలయంలో భక్తులు చాలా ఏళ్లుగా పూజలు చేస్తూనే ఉన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో కాకతీయుల కాలంలో శివాలయం నిర్మించారు. వందల ఏళ్లనాటి ఆలయం కావడంతో ఆదరణ కరువై క్రమేణా కూలిపోయింది. అయినా శివలింగం మాత్రం చెక్కు చెదరలేదు. ఆలయ ప్రాకారాలు, ధ్వజస్తంభాలు, నంది విగ్రహాలు, అన్ని శిథిలమైనా శివలింగం మాత్రం నేటికి విరాజిల్లుతూనే ఉంది. దీంతో పాలకులు, అధికారులు పట్టించుకోకున్నా భక్తులు మాత్రం చింతచెట్టు నీడన ఉన్న శివుడికి పూజలు చేస్తూనే ఉన్నారు. శనివారం జరగనున్న శివరాత్రి వేడుకలకు భక్తుల ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టినట్లు భక్తుడు బొమ్మగాని లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ప్రాచీన శిల్పకళకు అద్దంపట్టే ఆలయాన్ని పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చెట్టుకింద పురాతన శివాలయం

కేసీఆర్ ఆలోచనతో విభిన్న పథకాలు

- నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట: తెలంగాణ సీఎం కేసీఆర్ విభిన్న ఆలోచనలతోనే పథకాల రూపకల్పన జరిగి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం 480 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు కోట్ల మంది ప్రజల యోగక్షేమాలు తెలిసిన మహోన్నతమైన వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతీ సంక్షేమ పథకానికి ఒక చరిత్ర ఉంటుందన్నారు. ప్రతీ ఇంటిలో తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న, ఓడీసీఎంఎస్ చైర్మన్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సైబర్‌నేరాలపై అవగాహన ర్యాలీ



గీసుకొండ: స్థానిక జెడ్పీ పాఠశాల విద్యార్థుల పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి పోలీస్‌స్టేషన్ వరకు సాగిన ర్యాలీలో సైబర్ నేరగాళ్లపై జాగ్రత్తగా ఉండాలని, సెల్‌ఫోన్లలో అనవసరంగా వచ్చే మెస్సేజీలు, ఓటీపీలు, కాల్స్‌కు బదులు ఇవ్వవద్దని ఎస్‌ఐ వెంకన్న అవగాహన కలిగించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోత్స్న, ప్రభ, ఎస్సై శ్వేత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మేనేజర్ నరేష్

వర్ధన్నపేట: ఆర్థిక క్రమశిక్షణతో అవగాహన కలిగి ఉండి బ్యాంకు సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ హవేలీ రాజు అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇల్లంద శాఖ, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం వర్ధన్నపేట ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కుమ్మరిగూడెంలో అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక భద్రత పథకాలైన ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి, బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాలను అందరు సద్వినియోగపరుచుకోవాలన్నారు. అదేవిధంగా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు మేనేజర్ నరేష్ మాట్లాడుతూ వ్యక్తిగత క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ భాస్కర్, కౌన్సిలర్లు కమలాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి

చెన్నారావుపేట: ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు శాతం పెరిగే విధంగా కృషి చేయాలని మండల నోడల్ ఆఫీసర్ ఫ్లోరెన్స్, కాంప్లెక్స్ హెచ్‌ఎం రజినీ అన్నారు. స్థానిక హైస్కూల్‌లో ప్రైమరీలెవల్ స్కూల్ కాంప్లెక్స్, ఫిజికల్ సైన్స్ యూపీ లెవల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలిమెట్టు కార్యక్రమంపై ఉపాధ్యాయులతో రివ్యూ తీసుకున్నామన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. జనవరి మాసం రిపోర్ట్‌ను అప్‌డేట్ చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను రెగ్యూలర్‌గా నిర్వహించాలన్నారు. సోమవారం నుంచి పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులపై ప్రత్యేక టీంలు అన్ని హైస్కూల్ పాఠశాలలను సందర్శిస్తారని చెప్పారు. సమావేశంలో ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, బాలాజీరావు, నర్సయ్య, మల్లయ్య, నర్సింహరెడ్డి, ఆజాం, సూరయ్య, ఇంద్రసేనారెడ్డి, వీర భద్రయ్య, విజేందర్, రమేష్, తస్య, పూర్ణిమ, హమీదా బాను, పవనకుమారి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ ఫ్లోరెన్స్

22 నుంచి ఆవిర్భావ వేడుకలు

చెన్నారావుపేట : ఈ నెల 22 నుంచి గ్రామాల్లో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆవిర్భావ వేడుకలను జరుపుకోవాలని చెన్నారావుపేట, నెక్కొండ మండలాల కార్యదర్శి అడ్డూరి రాజు పిలుపునిచ్చారు. మండలంలోని జల్లీ గ్రామంలో కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ పెట్టుబడిదారి వర్గాలకు దేశ సంపదను అప్పనంగా కట్టబెడుతూ దేశంలో ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, పేదరికాన్ని పెంచి పోషిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్ణాకర్, భాస్కర్, రాము, రాజ్‌కుమార్, జగన్‌లు ఉన్నారు.

ఆరోపణలు కాదు..దమ్ముంటే నిరూపించాలి

రాయపర్తి: తప్పుడు ఆరోపణలు కాదు దమ్ముంటే నిరూపించాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని మహబూబ్‌నగర్ కట్టమీద చెప్పుల దండలను కట్టి చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో 80 ఎకరాలు భూకబ్జా చేశారంటూ ఎర్రబెల్లిపై తప్పుడు ఆరోపణలు చేసే ముందు ఆలోచించుకొని మాట్లాడాలన్నారు. దమ్ముంటే మహబూబ్‌నగర్‌కు వచ్చి నీవుగాని నీ అనుచరులుగానీ నిరూపించాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ కట్టమైసమ్మ సాక్షిగా సవాల్ విసురుతున్నట్లు చెప్పారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, మండల ప్రధానకార్యదర్శి పూస మధు, డైరెక్టర్ యాదగిరిరెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, వీరస్వామి, సురేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డిపై ఫిర్యాదు వేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మల్లయ్య

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు కుండె మల్లయ్య, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ రఫీలు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సహకారంతో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. కోటి నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఎస్సీకాలనీలో పూర్తి స్థాయిలో సీసీ రోడ్డు వేస్తున్నామన్నారు. ఈ మేరకు మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే పెద్దిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జున్నూతుల రాంరెడ్డి, బీఆర్‌ఎస్ మండల నాయకులు కంది కృష్ణ చైతన్యరెడ్డి, సొసైటీ డైరెక్టర్ జంగిలి రాజు, పెద్దలు బర్ల దేవదాసు, రమేష్, సునీల్, సదయ్య, తాళ్లపెల్లి నర్సయ్య, బండి ఉపేందర్, గౌడిశాల సురేందర్, గట్ల రాంబాబు, మహేందర్‌రెడ్డి, కందకట్ల సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



సంగెం : ఆర్థికసాయం అందజేస్తున్న మాధవరెడ్డి



వర్ధన్నపేట: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ దయాకర్

వర్ధన్నపేట : పట్టణానికి చెందిన జేఏసీ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు తుమ్మల శ్రీధర్ తల్లి లక్ష్మి(75) ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ శుక్రవారం వారి ఇంటికి వెళ్లి శ్రీధర్ కుటుంబాన్ని పరామర్శించారు. ఎంపీ వెంట నాయకులు హన్మకొండ సుధాకర్, మాశెట్టి సోమయ్య, మల్లెపాక బాస్కర్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

రాయపర్తి: మండలంలోని బురహాన్‌పల్లికి చెందిన కన్నాల సూరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన కొండిన్య యువజన సంఘం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 20,500 ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో యువజన సంఘం అధ్యక్షుడు బండ్లగూడ బాలరాజు, సభ్యులు పాల్గొన్నారు.

సంగెం: మండలంలోని కాట్రపల్లి శివారు వడ్డెరగూడెంకు చెందిన వల్లెపు రమేష్ ఇటీవల మృతి చెందాడు. శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లేటి మాధవరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఐనుగాల చారిటబుల్ ట్రస్ట్ చెక్కును, 50 కిలోల బియ్యంను అందించారు. పరామర్శించిన వారిలో నాయకులు బట్టమేకల అయిలయ్య, వనమారెడ్డి, లింగారెడ్డి, యుగేందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి



గీసుకొండ: విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను సాధించి ఉన్నతంగా ఎదగాలని కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గాదె దయాకర్ అన్నారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారం జెడ్పీ పాఠశాల వజ్రోత్సవాల సందర్భంగా పూర్వ విద్యార్థి అయిన ఆయన పాఠశాలను సందర్శించి తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ఉన్నతంగా చదివి తల్లిదండ్రులు, గ్రామం, పాఠశాలకు మంచిపేరు తేవాలన్నారు. హెచ్‌ఎం సుజాత, ఎస్‌ఎంసీ కో ఆప్షన్ మెంబర్ కొక్కొండ శ్రీకాంత్, పర్వ మోహన్, గాదె సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తడి, పొడిచెత్తతో సేంద్రియ ఎరువు

వరంగల్ (పర్వతగిరి): తడి, పొడి చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేసి అధిక లాభాలు పొందవచ్చని సర్పంచ్ గటిక సుష్మమహేష్ అన్నారు. మండలంలోని చింతనెక్కొండలో శుక్రవారం తడి, పొడి చెత్త సేకరణతో సేంద్రియ ఎరువుల ద్వారా వచ్చే లాభాల గురించి మహిళా సంఘాలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వేస్ట్ చెత్త నుంచి ఆదాయం పొందేందుకు డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసిందన్నారు. సేంద్రియ ఎరువులను కూరగాయలు, వివిధ పంటలకు వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దేవేందర్, కార్యదర్శి సరిత, మహిళా సంఘం సీఏలు బొల్లం రమ, బోనాల రాజు, దబ్బేట నర్సింహులు, మహిళా సంఘం మూడు వీవోల అధ్యక్షులు, మహిళా సంఘం లీడర్లు, పాల్గొన్నారు.



ఎరువుల ప్యాకెట్లను అందజేస్తున్న సర్పంచ్

కొమ్మాల జాతర వేలం పాటలు

గీసుకొండ: మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు, జాతరను పురస్కరించుకుని శుక్రవారం వేలం పాటలను నిర్వహించారు. జాతరలో కొబ్బరిచిప్పలను పోగు చేయడానికి గత జాతరలో రూ. 93,500 రాగా ప్రస్తుతం రూ. 1,01,000 వేలం పాట ఖరారైందన్నారు. పుట్నాలు, పేలాల అమ్మకానికి గతంలో రూ. 13,500 రాగా ప్రస్తుతం రూ. 14,500 ఖరారైందని ఆలయ ఈవో శేషగిరి తెలిపారు. తలనీలాలు పోగు చేయడం, కొబ్బరికాయల అమ్మకం గతంతో పోలిస్తే తక్కువగా వేయడంతో వాయిదా వేశామన్నారు.

హామీలు నెరవేర్చడంలో విఫలం



మాట్లాడుతున్న ఆనంద్

నర్సంపేట రూరల్ : పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేసీఆర్ సర్కారు పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దూపటి ఆనంద్ అన్నారు. మండలంలోని రాజుపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రోజుకో మాట చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారనే తప్పా ప్రజలకు ఒరగబెట్టింది ఏమి లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ ముత్తినేని వెంకటేశ్వర్లు, బూత్ అధ్యక్షుడు తండా వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, మెట్టు కుమారస్వామి, తిరుమల నర్సింహస్వామి, బర్ల కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.